తెలంగాణపై బాబు కుట్రలివి

- ఏడు మండలాలు లాక్కొని విద్యుత్తు సరఫరా నిలిపేసిన ఘనుడు
- టీడీపీ హయాంలో తెలంగాణ పదం నిషేధం

బేగంపేట విమానాశ్రయం నుంచి ర్యాలీగా వస్తున్న ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): చంద్రబాబు.. అంటే తెలంగాణ వ్యతిరేక కుట్రలు, కుయుక్తులకు కేరాఫ్. ఆయనలో నరనరాన తెలంగాణ వ్యతిరేకతే కనిపిస్తుంది. తెలంగాణ ప్రయోజనాలకు గండికొట్టడంలో చంద్రబాబును మించినవారుండరనేది చారిత్రక వాస్తవం. చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు అసెంబ్లీలో తెలంగాణ పేరును ఉచ్చరించేందుకు కూడా అనుమతించని దారుణ పరిస్థితులను తెలంగాణ చవిచూసింది. స్వరాష్ట్ర ఏర్పాటును చంద్రబాబు అడుగడుగునా అడ్డుకున్నారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత కూడా అదే తీరును ప్రదర్శించారు. ఏడు మండలాలను లాక్కుని, విద్యుత్తు సరఫరాను నిలిపివేసి అణువణువునా తెలంగాణను ఇబ్బందులపాలు చేశారు. మళ్లీ ఇప్పుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో కలిసి సరికొత్త జగన్నాటకానికి తెరలేపారు. విభజన సమస్యల పరిష్కారం కోసం సీఎంల భేటీ అంటూ డ్రామా మొదలుపెట్టారు. తెలంగాణపై కసిపెట్టుకుని.. ఇప్పుడు మొసలి కన్నీరు కార్చేందుకు రెడీ అయ్యారు. ఆకలిగా ఉన్నవాడి అన్నం లాక్కునే ప్రయత్నం చేసి.. అజీర్తి చేసిన వారికి సద్దికట్టినట్టుగా వ్యవహరించిన చంద్రబాబు.. ఇప్పుడు తెలంగాణ అన్నాన్ని మళ్లీ లాక్కునేందుకే ఇలా చేస్తున్నారని తెలంగాణవాదులు ఆరోపిస్తున్నారు.

చంద్రబాబు కుట్రల చిట్టా..

- తెలంగాణ రాష్ట్రంగా ఏర్పడగానే భద్రాచలం డివిజన్‌లోని ఏడు మండలాలను తెలంగాణ ప్రభుత్వంతో కనీసం సంప్రదించకుండా చంద్రబాబే కేంద్రంపై ఒత్తిడి తెచ్చి విలీనం చేసుకున్నారు. 460 మెగావాట్ల లోయర్ సీలేరు విద్యుత్తు ప్రాజెక్టును తెలంగాణకు దక్కనివ్వలేదు. చేశారు. అనంతపురం, కర్నూల్‌లో 400 మెగావాట్ల సంప్రదాయేతర విద్యుత్తు ప్లాంట్ల ద్వారా ఒక్క యూనిట్ విద్యుత్తు రాకుండా చంద్రబాబే అడ్డుకున్నారు.
- తెలంగాణ ఏర్పడ్డప్పుడు రాష్ట్రంలో కరెంట్ కష్టాలు వర్ణణాతీతం. విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల్లో ఉత్పత్తి అయిన కరెంట్‌లో 54% తెలంగాణకు ఇవ్వాలి. ఏపీలో అధికారంలోకి రాగానే బాబు పవర్ పర్చేజ్ అగ్రిమెంట్లను రద్దుచేశారు. కృష్ణపట్నం నుంచి కరెంట్ రాకుండా అడ్డుకున్నారు. ఏపీ నుంచి తెలంగాణకు రావాల్సిన విద్యుత్తును అడ్డగించారు. తాను వ్యతిరేకించినా తెలంగాణ స్వరాష్ట్రమయ్యింది అన్న అక్కసుతో తెలంగాణను చీకట్లల్లో ఉంచేందుకు, రైతుల ఉసురు పోసుకునేందుకు చంద్రబాబు చేసిన కుట్రలకు ఈ ఒక్క ఉదాహరణే నిదర్శనం.
- సరిగ్గా కరెంట్ కోతలున్నపుడే కడపలోని రాయలసీమ థర్మల్ పవర్‌ప్లాంట్ (ఆర్‌టీపీపీ), విజయవాడ థర్మల్ పవర్‌ప్లాంట్ (వీటీపీఎస్)లలో విద్యుత్తు ఉత్పత్తిని నిలిపివేశారు. దీంతో తెలంగాణకు రావాల్సిన 710 మెగావాట్ల విద్యుత్తు నిలిచిపోయింది. అప్పుడే పుట్టిన బిడ్డలాంటి తెలంగాణను పురిట్లోనే చంపేందుకు చంద్రబాబు పన్నిన విషపు పన్నాగంలో భాగమే ఈ చర్య. తెలంగాణకు అదనపు విద్యుత్తు కావాలని కేంద్రాన్ని కోరితే ఢిల్లీకి వెళ్లి తెలంగాణకు అదనపు విద్యుత్తు రాకుండా అడ్డుకున్నది బాబే. కేంద్ర విద్యుత్తు పాలసీలో మూడు రాష్ట్రాలకు 24 గంటల కరెంట్ పథకం పెడితే.. తెలంగాణకు దక్కకుండా అడ్డుకుని 24 గంటల కరెంట్ పథకాన్ని ఏపీకి తరలించుకుపోయారు.
- విభజన చట్టం ప్రకారం ఎంసెట్ సహా పలు ప్రొఫెషనల్ కోర్సుల్లో ప్రవేశాలకు రెండు రాష్ట్రాల్లోనూ సమాన అవకాశాలు కల్పించారు. ఓపెన్ కోటాలో 15% సీట్లకు ఇరు రాష్ట్రాల విద్యార్థులు పోటీపడే అవకాశం ఉన్నది. తెలంగాణ రాష్ట్రంలో ఏపీ విద్యార్థులకు అవకాశం కల్పించగా, ఏపీ మాత్రం తెలంగాణ విద్యార్థులకు అవకాశం కల్పించకుండా నోటిఫికేషన్ ఇచ్చింది. మళ్లీ పునరుద్ధరించారు.
- హైదరాబాద్ ఉమ్మడి రాజధాని సాకుగా చూపి శాంతిభద్రతలను గవర్నర్‌కు అప్పగించాలని అప్పట్లో చంద్రబాబు స్వయంగా కేంద్రానికి లేఖ రాశారు. తమ ప్రాంత ప్రజలున్నారని, రక్షణ కల్పించాలని అప్పట్లో హడావుడి చేశారు. పోలీసు చెక్‌పోస్టులు పెడతామన్నారు. తెలంగాణ మీద పెత్తనం చేసేందుకు, కేంద్ర ప్రభుత్వం పేరుతో హైదరాబాద్‌ను తామే పాలించాలని అప్పట్లో బాబు కుట్రలు పన్నారు.
- తెలంగాణకు పెట్టుబడులు రాకుండా అడ్డుకునేందుకు మతఘర్షణలు జరుగుతాయని బెదిరించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్లు పెట్టి మరీ బాంబుపేలుళ్ల విజువల్స్‌ను చూపించి, నక్సలైట్ల సమస్య ఉన్నదని రిపోర్టులిచ్చారు. తెలంగాణ అంటేనే టెర్రరిస్టులు, నక్సలైట్ల అడ్డా అని పెట్టుబడులు రాకుండా విషప్రచారం చేశారు.
- హైదరాబాద్‌లో అక్రమ నిర్మాణాల విషయంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కఠినంగా వ్యవహరించింది. దీనిని అడ్డుకునేందుకు అప్పట్లో టీడీపీ ఎమ్మెల్యేలను పురామాయించి చంద్రబాబు ధర్నాలు చేయించారు. తద్వారా తెలంగాణలో అక్రమ నిర్మాణాలను స్వయంగా ప్రోత్సహించారు.
- నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (న్యాక్) అనే సంస్థ ఉన్నది హైదరాబాద్‌లో. ఈ సంస్థకు ఏపీ ప్రభుత్వం అప్పట్లో డైరెక్టర్ జనరల్‌ను నియమించింది. తెలంగాణకు చెందిన ఒక సంస్థకు ఏపీ డైరెక్టర్ జనరల్‌ను నియమించిన నీతిమాలిన చరిత్ర చంద్రబాబుది.
- పబ్లిక్ సర్వీస్ కమిషన్ సహా ఉమ్మడి సంస్థలకు చెందిన అకౌంట్లను ఫ్రీజ్‌చేశారు. దీంతో తెలంగాణకు వాటాగా రావాల్సిన నిధులు దక్కడంలేదు. విద్యుత్తు ఉద్యోగుల పెన్షన్ ట్రస్టుకి సంబంధించి ఏపీ జెన్‌కో నుంచి రూ.2,478 కోట్లు, ఏపీ ట్రాన్స్‌కో నుంచి తెలంగాణ ట్రాన్స్‌కోకు రూ.914 కోట్ల చొప్పున మొత్తంగా రూ.3,392 కోట్లు రావాల్సి ఉన్నది. ఇవేకాకుండా ఏపీ విద్యుత్తు సంస్థల నుంచి తెలంగాణ విద్యుత్తు సంస్థలకు రూ.3,392 కోట్లు బకాయిల రూపంలో రావాల్సి ఉన్నది.

చంద్రబాబుకు స్వాగతం

మొదటిపేజీ తరువాయి...

తమ్ముళ్ల అనుమతులు లేకుండా మెట్రో పిల్లర్లకు, సెంట్రల్ మీడియన్, ప్రధాన కూడళ్లలో కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. తొలగించాల్సిన ఈవీడీఎం విభాగం చేతులెత్తేసింది. దీంతో ఆ శాఖ అధికారుల పనితీరుపై నెటిజన్లు తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. తెలంగాణ ద్రోహికి అధికార పార్టీ దాసోహం అయిందంటూ తెలంగాణ వాదులు మండిపడుతున్నారు.

ఫ్లెక్సీ పెట్టిన ట్రాఫిక్ పోలీస్

జూబ్లీహిల్స్ చౌరస్తాలో టీడీపీ శ్రేణులు ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా.. ఆ ఫ్లెక్సీలను నగర ట్రాఫిక్ సిబ్బంది సరిచేసి ఏర్పాటు చేస్తున్న వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. టీడీపీ ఫ్లెక్సీలను ట్రాఫిక్ పోలీసులు ఏ ర్పాటు చేస్తున్నారని చర్చ జరిగింది. అ యితే వెంటనే తేరుకున్న ట్రాఫిక్ పోలీస్ అధికారులు.. అసలేం జరిగిందని చౌరస్తాలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించారు. ఫ్లెక్సీలు పడిపోతుండటంతో సి బ్బంది వాటిని సరిచేశారు. ఈ విషయంపై వివరణ ఇస్తూ ట్రాఫిక్ పోలీసులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయలేదని, పడిపోతున్న ఫ్లెక్సీతో ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా దాన్ని వెనక్కి జరిపారని తెలిపారు.

ఆటకెక్కిన అడ్వర్టైజ్‌మెంట్ పాలసీ

సరళీకృతమైన అడ్వర్టైజ్‌మెంట్ పాలసీని పక్కాగా ఆమలుచేయాల్సిన ఈవీడీఎం గత కొద్ది రోజులుగా చేతులెత్తేసింది. జీవో 68 ప్రకారం 15 మీటర్ల కంటే ఎత్తు ఉన్న హోర్డింగ్‌లను ఎట్టిపరిస్థితుల్లో అనుమతించవద్దు. ఫ్లెక్సీలు, హోర్డింగ్స్‌లో నిబంధనలు ఉల్లంఘించే యాడ్ ఏజెన్సీలకు భారీ జరిమాన, క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సిన జీహెచ్‌ఎంసీ ప్రకటనల విభాగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించింది.

నేడు 'తెలుగు' సీఎంల భేటీ

- ప్రజా భవన్‌లో రేవంత్‌రెడ్డి, చంద్రబాబు సమావేశం
- 'విభజన' అంశాలపై చర్చ
- పాల్గొననున్న ఇరు రాష్ట్రాల డిప్యూటీ సీఎంలు, మంత్రులు

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ, ఏపీ సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబునాయుడు శనివారం ప్రజాభవన్‌లో భేటీ కానున్నారు. రాష్ట్ర విభజనకు సంబంధించి అపరిష్కృతంగా ఉన్న అంశాలపై చర్చించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో ఇరు రాష్ట్రాల డిప్యూటీ సీఎంలు భట్టి విక్రమార్క, పవన్ కల్యాణ్ పాల్గొననున్నారు. వీరితోపాటు తెలంగాణ నుంచి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇతర మంత్రులు, ఏపీ నుంచి మున్సిపల్‌శాఖ మంత్రి నారాయణ పాల్గొంటారని సమాచారం. షెడ్యూల్ 9, షెడ్యూల్ 10లో ఉన్న సంస్థల విభజన, షెడ్యూల్ 9లో ఉన్న మొత్తం 91 సంస్థల ఆస్తులు, అప్పులు, నగదు నిల్వల పంపిణీ, పదో షెడ్యూల్‌లో ఉన్న 142 సంస్థల్లో తెలుగు అకాడమీ, తెలుగు యూనివర్సిటీ, అంబేద్కర్ వర్సిటీ వంటి 30 సంస్థల పంపిణీ, విద్యుత్తు సంస్థల బకాయిలపై చర్చించనున్నారు. ఏపీ ప్రభుత్వం దాదాపు రూ.24 వేల కోట్లు తెలంగాణకు చెల్లించాల్సి ఉండగా, తమకే తెలంగాణ రూ.7 వేల కోట్లు బకాయి ఉన్నదంటూ ఏపీ పట్టుబడుతున్నది.

చంద్రబాబు మళ్లీ రెండు కండ్ల సిద్ధాంతం!

- రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధి ముఖ్యమంటూ వ్యాఖ్యలు
- మళ్లీ తెలంగాణను మోసం చేసే కుట్ర అంటూ ఆగ్రహం
- ఏపీ సీఎంగా ఉంటూ... తెలంగాణ అభివృద్ధి కోరడాన్ని నమ్మేదెలా?

హైదరాబాద్, జూలై 5(నమస్తే తెలంగాణ): ఏపీ సీఎం చంద్రబాబు మళ్లీ రెండు కండ్ల సిద్ధాంతాన్ని తెరపైకి తీసుకొచ్చారు. శుక్రవారం ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందడమే తనకు ముఖ్యమంటూ సన్నా యి నొక్కులు నొక్కారు. అయితే, తెలంగాణపై మళ్లీ చంద్రబాబు నీడ వాలితే రాష్ట్రం అధోగతేననే తెలంగాణవాదులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. గతంలో రెండు కండ్ల సిద్ధాంతం.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆలస్యం చేసిందని, ఇప్పుడు మళ్లీ అదే సిద్ధాంతం తెలంగాణను నాశనం చేయడం ఖాయమని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఏపీ సీఎంగా గెలిచిన తర్వాత తొలిసారి హైదరాబాద్‌కు వచ్చిన చంద్రబాబు.. బే గంపేట నుంచి నిర్వహించిన భారీ ర్యాలీని తెలంగాణలో ఉనికి కోసం చేసిన బలప్రదర్శనగా చూడాలని తెలంగాణ వాదులు పేర్కొంటు న్నారు.

ఏపీకి సీఎంగా ఉంటూ.. తెలంగాణకు న్యాయమెలా చేస్తారు?

రెండు రాష్ట్రాల అభివృద్ధే తనకు ముఖ్యమంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ సమాజం పలు ప్రశ్నలు సంధిస్తున్నది. ఏపీ సీఎంగా ఉన్న చంద్రబాబు తెలంగాణకు ఏ విధంగా న్యాయం చేయగలరు? పారిశ్రామికరంగంలో ఏపీకి వచ్చే పెట్టుబడులను తెలంగాణకు మళ్లిస్తారా? లేకపోతే తెలంగాణకు వచ్చే పెట్టుబడులను తన సొంత రాష్ట్రానికి తీసుకెళ్లే ప్రయత్నం చేయరా? అని అని తెలంగాణవాదులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే తెలంగాణకు రావాల్సిన పలు పరిశ్రమలను ఏపీకి తీసుకెళ్లేందుకు చంద్రబాబు చర్చలు జరుపుతున్నారనే ప్రచారం జరుగుతున్నది. ఇదేనా రెండు కండ్ల సిద్ధాంతం? అని ప్రశ్నిస్తున్నారు.

బదిలీ అయిన వారిని వెనక్కితేవాలి: టీజీవో

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): ఎన్నికల సందర్భంగా బదిలీ అయిన అధికారులను వెనక్కి రప్పించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం(టీజీవో) రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. పెండింగ్‌లో ఉన్న 5 డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేసింది. టీజీవో కేంద్ర సంఘం కార్యవర్గ అత్యవసర సమావేశాన్ని శుక్రవారం నాంపల్లిలోని టీజీవోభవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎనుగుల సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈహెచ్‌ఎస్ పథకాన్ని అమలు చేసి, ప్రస్తుతమున్న మెడికల్ రీయింబర్స్‌మెంట్ గడువు కాలాన్ని పొడిగించాలని కోరారు. అన్నిశాఖల్లో పదోన్నతులు కల్పించాలని తీర్మానాలు చేశారు. సమావేశంలో అసోసియేట్ అధ్యక్షుడు బీ శబ్యూమ్, ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, కోశాధికారి ఎం ఉపేందర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ పరమేశ్వర్‌రెడ్డి, దీపారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ మాచర్ల రామకృష్ణగౌడ్, యాదగిరి, పలు జిల్లాల డిపార్ట్‌మెంటల్ ఫోరమ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

'నై తెలంగాణ' బాబుకు 'పచ్చ'లహారం!

- హైదరాబాద్‌లో ఏపీ సీఎం చంద్రబాబు హంగామా
- తెలంగాణవాదుల్లో ఆందోళన

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మధ్య చర్చల పేరుతో ఏపీ సీఎం చంద్రబాబు శనివారం హైదరాబాద్‌లో అడుగుపెట్టిన సందర్భంగా సృష్టించిన హంగామా తెలంగాణవాదుల్లో మరోసారి ఆందోళన రేకెత్తిస్తున్నది. తెలంగాణ ఏర్పడిన తరువాత గత పదేండ్లలో ఎన్నడూలేని రీతిలో హైదరాబాద్ పసుపుమయమైంది. చంద్రబాబు రాక సందర్భంగా హైదరాబాద్‌లో కట్టిన 'పచ్చ'లహారంపై తెలంగాణ సమాజం భగ్గుమంటున్నది. తెలంగాణ రాష్ట్రాన్ని విఫల ప్రయోగం చేయాలని 2015లో కుట్రపన్నిన చంద్రబాబు వస్తుండటం తమ ఆందోళనకు ప్రధాన కారణమని తెలంగాణ ఉద్యమకారులు చెప్తున్నారు. 'నేను ఈ నెల 6న వస్తున్నా. పరస్పర లబ్ధికోసం మనం ముఖాముఖి కూర్చొని మాట్లాడుకుందాం. మన సమావేశం రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు మేలు జరగాలి' అని ఈ నెల 1న ఏపీ సీఎం చంద్రబాబు.. రేవంత్‌రెడ్డికి రాసింది నిర్దేశపూర్వక లేఖ అని తెలంగాణ సమాజం అభిప్రాయపడుతున్నది. చంద్రబాబు లేఖ అందిన తెల్లారే 'తమరి రాక మాకెంతో సంతోషం సుమండీ' అనే రీతిలో రేవంత్ ప్రత్యుత్తరం రాయడంలోని ఆంతర్యం తెలంగాణ సమాజానికి తెలుసని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బాబు చెప్పు చేతుల్లోనే రేవంత్ పనిచేస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో తెలంగాణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

ఇదీ బాబు బోనం దించిన కథ

2012లో తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో చంద్రబాబు ఆదిలాబాద్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. డిసెంబర్ 29న పాదయాత్ర ఉమ్మడి వరంగల్ జిల్లా చిట్యాల మండలం టేకుమట్ల శివారులో నాటి టీడీపీ మహిళలు బోనాలతో స్వాగతం పలికారు. 'జై తెలంగాణ' అని రాసి ఉన్న బోనాన్ని చంద్రబాబు ఎత్తుకున్నారు. రెప్పపాటులో ఆయన అనుచరులు (ఆంధ్రాభిమానులు) 'మీరు ఎత్తుకున్న ది 'జై తెలంగాణ' అని చెప్పగానే బాబు ఆ బోనాన్ని దించేశారు.

మోదీకే హుకూం

'రాష్ట్రానికి అతి ముఖ్యమైన ప్రాజెక్టు పోలవరం. 2014లో ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యాను. పోలవరం వల్ల ముంపునకు గురయ్యే ఏడు మండలాలు తెలంగాణలో ఉన్నాయి. ఆ ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్‌కు ఇస్తే తప్ప ప్రాజెక్టు పూర్తికాదు. ఏడు మండలాలు ఇవ్వకపోతే నేను ప్రమాణ స్వీకారం చేయను. నాకే పదవి వద్దు అని స్పష్టంగా చెప్పాను. ఆ రోజు ప్రధాని మోదీ ఫస్ట్ క్యాబినెట్ మీటింగ్‌లో పెట్టి, ఒక ఆర్డినెన్స్ ఇచ్చి ఆ ఏడు మండలాలు ఆంధ్రప్రదేశ్‌కి ఇచ్చి, ఆ తరువాత పార్లమెంట్ సమావేశాలు పెట్టుకున్నారంటే అదొక చరిత్ర'.

-11 జూన్ 2024లో అమరావతిలోని ఓ కన్వెన్షన్‌లో జరిగిన టీడీఎల్పీ సమావేశంలో చంద్రబాబు

విలీన గ్రామాలపై ఉద్యమించింది బీఆర్‌ఎస్సే

- ఏపీలో కలిసిన ఆ ఐదు పంచాయతీలపై అప్పడే ఒప్పందం
- నిర్ణయం జరిగింది.. అమలే మిగిలింది
- ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం లేఖలు రాయడం రాజకీయ డ్రామా?
- ఇతరుల ఘనతను తమ గొప్పగా చెప్పకోవడం కోసమే..!

ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/భద్రాద్రి కొత్తగూడెం, జూలై 5 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్‌లో కలిసిన ముంపు మండలాలపై కాంగ్రెస్ ప్రభుత్వం మరో రాజకీయ డ్రామాకు తెరలేపటం చర్చనీయాంశమైంది. ముంపు మండలాల్లో ఉన్న భద్రాచలం పరిధిలోని ఆ ఐదు పంచాయతీలు ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారాయి. ప్రస్తుతం ఏపీ పరిధిలో ఉన్న పిచుకులపాడు, కన్నాయిగూడెం, గుండాల, పురుషోత్తపట్నం, ఎటపాక పంచాయతీలు తెలంగాణ ఏర్పడక ముందు భద్రాచలం మండల పరిధిలోనే ఉండేవి. కానీ పోలవరం ముంపు సాకుతో ఆ ఐదు గ్రామాలను రాష్ట్రం విడిపోయినప్పుడు ఏపీలో కలిపారు. దీంతో ఆ గ్రామాల ప్రజలు సమస్యలను తెలంగాణ ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. అప్పటినుంచి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏపీ ప్రభుత్వంతో పోరాటం చేసింది. ఆనాడే అఖిలపక్షం ఆధ్వర్యంలో పెద్దఎత్తున భద్రాచలంలో ఉద్యమం చేసిన ఘటనలు కూడా ఉన్నాయి. అప్పటి వైసీపీ ప్రభుత్వంతో తెలంగాణ సీఎం కేసీఆర్ మాట్లాడి బీజేపీ ప్రభుత్వం దృష్టికి సైతం తీసుకెళ్లారు. అప్పట్లో అన్నీ సానుకూలంగా ఉన్నా ఎన్నికలు రావడంతో అది మరుగునపడింది. కానీ.. ఇప్పుడు కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీలో ఉన్న ఐదు పంచాయతీలను తెలంగాణలో తామే కలుపుతున్నామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉన్నది. ఏపీ సీఎంకు లేఖలు రాసి ఇది తమ వల్లే సాధ్యమైందని గొప్పలు చెప్పుకోవటం మొదలుపెట్టింది.

ఇది రాజకీయ డ్రామా

> ముంపు గ్రామాలను భద్రాచలంలో కలపాల్సిందే. డ్రామాలు ఆడటం కాంగ్రెస్ ప్రభుత్వానికి కొత్తేమీకాదు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టారు.. కాబట్టి కచ్చితంగా అమలుచేయాలి. ఏపీ సీఎంకు మంత్రి తుమ్మల రాసిన లేఖను బహిర్గతం చేయాలి. ఇద్దరు సీఎంల భేటీ తర్వాత పోలవరం ముంపు గ్రామాలపై స్పష్టత ఇవ్వాలి. ముఖ్యంగా కరకట్ట విషయంలో రెండు ప్రభుత్వాలు అవగాహనకు వస్తే తప్ప నిర్మాణం పూర్తికాదు. లేకుంటే వరదలు వస్తే ముంపు తప్పదు. ఉద్యమాలకు వరదలే సాక్ష్యంగా నిలుస్తాయి.
>
> – బండారి రవికుమార్, సీపీఎం రాష్ట్ర నాయకుడు

ముంపు గ్రామాలకు దిక్కెవరు?

> పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయితే తెలంగాణలోని చాలా గ్రామాలు మునిగిపోతాయి. రైతులు, వ్యాపారులు, కూలీలు, సామాన్య ప్రజల జీవనం స్తంభించి దిక్కుతోచని పరిస్థితి దాపురిస్తుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల సీఎంలు విభజన హామీల పరిష్కారం దిశగా జరిగే సమావేశంలో ఈ విషయంపై చర్చ జరగాలి.
>
> – కేవీ రమణ, బీఆర్‌ఎస్ నాయకుడు, బూర్గంపాడు

హైదరాబాద్‌లోని ఆర్టీసీ ఆస్తులు తెలంగాణవే

- ఆర్టీసీ విభజన సమస్యను పరిష్కరించండి
- ఇరు రాష్ట్రాల సీఎంలకు ఆర్టీసీ టీఎంయూ విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో ఉన్న ఆర్టీసీ ఆస్తుల్లో ఏపీఎస్‌ఆర్టీసీ వాటా పొందాలని కుట్ర చేయడం తగదని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ) పేర్కొంది. బస్‌భవన్ స్థలం, ముషీరాబాద్ డిపో స్థలాలు, గౌలిగూడ బస్టాండు స్థలం, తార్నాక హాస్పిటల్ వంటివి తెలంగాణ ఆస్తులని, రాజ్యాంగంలోని ఆర్టికల్-9 ప్రకారం ఎక్కడి ఆస్తులు అక్కడే అనే ప్రాతిపదికన ఎట్టిపరిస్థితుల్లో కూడా ఏపీకి వాటా ఇచ్చే ప్రసక్తి లేదని స్పష్టం చేసింది. ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో దశాబ్దకాలంగా అపరిష్కృతంగా ఉన్న ఆర్టీసీ విభజన సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేసింది. ఆర్టీసీ మజ్దూర్ యూనియన్ ప్రధానకార్యదర్శి థామస్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్‌గౌడ్ నాయకత్వంలో ప్రతినిధి బృందం శుక్రవారం సచివాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆర్టీసీలో కార్మిక యూనియన్ల గుర్తింపు ఎన్నికలను తక్షణమే నిర్వహించాలని కార్మిక శాఖ కమిషనర్‌కు వినపతిపత్రం అందజేశారు. స్పందించిన కార్మికశాఖ కమిషనర్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రభుత్వానికి లేఖ రాస్తామని చెప్పినట్టు తెలిపారు. అదేవిధంగా అడిషనల్ లేబర్ కమిషనర్, జాయింట్ కమిషనర్‌కు కూడా వినతిపత్రాన్ని అందజేశారు.

న్యాయ సహాయం చేసి ఆదుకోండి

ఖైరతాబాద్, జూలై 5: పదేండ్లుగా కోర్టుల చుట్టూ తిరుగుతూ విసిగిపోయానని, తనకు న్యాయ సహాయం చేయాలని జెరూసలేం మత్తయ్య తెలుగు రాష్ట్రాల సీఎంలకు విజ్ఞప్తి చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓటుకు నోటు కేసుతో పాటు మరో నాలుగు కేసుల్లో 2015 నుంచి నేటి వరకు కోర్టుల చుట్టూ తిరుగుతున్నానని వాపోయారు. కోర్టు ఖర్చులకు కూడా డబ్బులేవని, ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో తన అంశాన్ని చర్చించి, న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో న్యాయపోరాటం చేస్తానని హెచ్చరించారు.

ఎస్సీల వర్గీకరణపై ఇద్దరు సీఎంలు చర్చించాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి

సిటీబ్యూరో, జూలై 5 (నమస్తే తెలంగాణ): తెలుగు రాష్ట్రాల సీఎంలు ఎస్సీ వర్గీకరణపైనా చర్చించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. 30 ఏండ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణపైనా ప్రధానంగా చర్చించాలని పేర్కొన్నారు. మాదిగలపై ఇద్దరు సీఎంలకు చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఢిల్లీ వెళ్లి వర్గీకరణ కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాలని సూచించారు. కేంద్రంలో పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ వర్గీకరణ అంశాన్ని ఓటు బ్యాంకుగా మార్చుకుందని మండిపడ్డారు. ఏపీ సీఎం చంద్రబాబు వర్గీకరణ విషయంలో గట్టిగా స్పందించాలని కోరారు.

ఆ 5 గ్రామాలను తెలంగాణకు ఇవ్వాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని విజ్ఞప్తి

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): భద్రాచలం సమీపంలోని 5 గ్రామాలను తెలంగాణకు తిరిగి ఇచ్చేందుకు రెండు ఇద్దరు సీఎంలు సానుకూలంగా చర్చించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. పిచ్చుకలపహాడ్, కన్నాయిగూడెం, ఏటపాక, గుండాల, పురుషోత్తమపట్నం గ్రామాలను తెలంగాణకు బదిలీ చేయాలని కోరారు. ఏపీ సీఎం చంద్రబాబు ఈ విషయంలో పెద్ద మనసుతో సీఎం రేవంత్‌తో సానుకూలంగా చర్చించాలని కోరారు.

సమస్యలను పరిష్కరించుకోవాలి

'తెలుగు' సీఎంలకు నారాయణ సూచన

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): రాష్ట్రాల హక్కులను కాపాడుకుంటూనే సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని తెలంగాణ, ఏపీ సీఎంలకు సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సూచించారు. శనివారం సీఎం రేవంత్‌రెడ్డి, చంద్రబాబు హైదరాబాద్‌లో సమావేశం కానుండటం శుభదినమని పేర్కొన్నారు. విభజన చట్టంలో పేర్కొన్న విధంగా ఏ రాష్ట్రానికి రావాల్సిన ప్రయోజనాలను వారు సాధించేందుకు కృషి చేయాలన్నారు. భద్రాచలంలో ముంపు ప్రాంతాలకు సంబంధించిన అంశాలను కూడా సున్నితంగా చర్చించి పరిష్కరించుకోవాలని కోరారు.

టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీపై మరో కేసు

నాంపల్లి కోర్టులు, జూలై 5 (నమస్తే తెలంగాణ) : ఫోన్ల ట్యాపింగ్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావును మరో కేసులో 10రోజుల పాటు కస్టడీకి అప్పగించాలని కోరుతూ 17వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఎదుట జూబ్లీహిల్స్ పోలీసులు శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు నిందితుడి తరపు న్యాయవాదికి నోటీసులు జారీచేసింది. రాధాకిషన్ న్యాయవాదులు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు పీపీని ఆదేశించింది. తనకు సమయం కావాలని పీపీ కోరడంతో.. రెండు కేసులను కోర్టు సోమవారానికి వాయిదా వేసింది.

సొంత రాష్ట్రాలకు పంపండి: ఎన్‌ఎల్ టీపీ

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులను సొంత రాష్ట్రాలకు పంపించాలని నాన్ లోకల్ టీచర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ కోరింది. విభజన సమస్యలపై శనివారం ఇద్దరు సీఎంల సమావేశం నేపథ్యంలో సొంత రాష్ట్రాలకు పంపించాలని అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శి వీ సూర్యనారాయణ కోరారు.

కాంగ్రెస్‌లోకి గద్వాల ఎమ్మెల్యే వద్దేవద్దు!

- గద్వాల, గాంధీభవన్ వద్ద హస్తం శ్రేణుల ఆందోళనలు

సుల్తాన్‌బజార్/గద్వాల, జూలై 5 : గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవద్దంటూ నిరసనలు హోరెత్తుతున్నాయి. ఆయన పార్టీ మారుతున్నారని నెల రోజులుగా సోషల్ మీడియాలో ప్రచారం జోరందుకోగా.. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన రాకను వ్యతిరేకిస్తున్నారు. ఎమ్మెల్యే చేరికను వ్యతిరేకిస్తున్నట్టు పార్టీ అధిష్ఠానంతోపాటు సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడానికి శుక్రవారం జడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో గద్వాల నుంచి 500 మంది పార్టీ నేతలు గాంధీ భవన్‌కు చేరుకున్నారు. ప్లకార్డులు ప్రదర్శించి బండ్లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆయనను హస్తం పార్టీలో చేర్చుకుంటే అసెంబ్లీ ఎన్నికల సమయంలో పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలంతా ఇబ్బందులు పడతారని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు.

నాంపల్లిలో ట్రాఫిక్‌కు అంతరాయం

ఓ వైపు నిరుద్యోగులు, విద్యార్థులు టీజీపీఎస్సీ వద్ద నిరసనలు తెలపటం, మరో వైపు గద్వాల ఎమ్మెల్యే చేరికను వ్యతిరేకిస్తూ కాంగ్రెస్ శ్రేణులు గాంధీభవన్ వద్ద నిరసన తెలపటంతో నాంపల్లి పరిసరాలలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అక్కడ భారీగా పోలీసులను మోహరించటంతో ఆ రహదారి పోలీసులతో నిండిపోయింది.

సాంకేతిక లోపంతోనే విద్యుత్ అంతరాయం

వైద్యారోగ్య శాఖ వివరణ

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : మంచిర్యాల జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో(ఎంసీహెచ్) గురువారం సాంకేతిక లోపంతోనే విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిందని వైద్యారోగ్య శాఖ పేర్కొన్నది. 'ఎంసీహెచ్'లో పవర్ కట్.. 3 గంటలు నిలిచిన సరఫరా' శీర్షికన శుక్రవారం నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి వైద్యారోగ్య శాఖ స్పందించింది. మంచిర్యాల ప్రభుత్వ దవాఖాన సూపరింటెండెంట్ తెలిపిన వివరాలు.. బుధవారం ఉదయం తరుచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. దాంతో జనరేటర్లను ఉపయోగించారు. మధ్యాహ్నం 12 గంటలకు టీజీఎంఎస్ఐడీసీ ఎలక్ట్రికల్ ఇంజినీర్ రమేశ్‌కు సమాచారం అందించారు. కేబుల్ సమస్యగా గుర్తించి దానిని మార్చారు. కేబుల్‌ను మార్చుతున్న సమయంలో అత్యవసర విభాగాలకు విద్యుత్ సరఫరా కొనసాగించారని తెలిపారు.

సీఈవోగా సుదర్శన్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ) : ఎన్నికల సంఘం ప్రధానాధికారి(సీఈవో)గా సీ సుదర్శన్‌రెడ్డి నియమిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకున్నది. 2002 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన సుదర్శన్‌రెడ్డి ప్రస్తుతం జీఏడీ కార్యదర్శిగా ఉన్నారు. గతంలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఇప్పటి వరకు సీఈవోగా ఉన్న వికాస్‌రాజ్ రాష్ట్ర సర్వీసులకు రానున్నారు.

కేసీఆర్‌కు సీతక్క లీగల్ నోటీసులు

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్‌తోపాటు ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు మంత్రి సీతక్క శుక్రవారం లీగల్ నోటీసులు పంపారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. 'ఇందిరమ్మ రాజ్యం.. ఇసుకాసురుల రాజ్యం' అనే వీడియో తన ప్రతిష్టకు భంగం కలిగించేలా ఉన్నదని ఆమె ఆక్షేపించారు. రూ.100 కోట్ల పరువు నష్టం దావా వేసిన సీతక్క.. బేషరతుగా లిఖితపూర్వకంగా తనకు క్షమాపణ చెప్పాలని నోటీసుల్లో కోరారు.

చనిపోయిన వ్యక్తికి ప్రమోషన్

- ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల్లో విచిత్రం
- పొరపాటును తెలుసుకుని లిస్ట్ నుంచి తొలగించిన విద్యాశాఖ

రంగారెడ్డి, జూలై 5(నమస్తే తెలంగాణ): రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ ఏడాది క్రితం చనిపోయిన వ్యక్తికి ప్రమోషన్ ఇచ్చి పోస్టింగ్ ఇచ్చారు. వినడానికి వింతగా ఉన్నా ఇది నిజమే. జిల్లాలో 213 మంది గ్రేడ్-2 హిందీ పండిట్లకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్ కల్పించారు. అయితే ఇందులో మంచాల మండలం తిప్పాయిగూడకు చెందిన బషీర్(సీరియల్-129, రోస్టర్ పాయింట్స్-163)కు ప్రమోషన్ కల్పించడమే విచిత్రం. ఎందుకంటే.. అతను గత ఏడాది జూన్ 1న మరణించారు. అధికారులు మాత్రం గుడ్డిగా ప్రమోషన్ ఇవ్వడమే కాకుండా పోస్టింగ్ ఇచ్చారు. లిస్ట్‌లో బషీర్ పేరు ఉండటంతో ఉపాధ్యాయులంతా షాక్ అయ్యారు. విషయం అధికారుల దృష్టికి వెళ్లడంతో జరిగిన పొరపాటును గ్రహించి వెంటనే లిస్ట్ నుంచి బషీర్ పేరును తొలగించి మరో లిస్టు విడుదల చేశారు. డీఈవో సుశీందర్‌రావు స్పందిస్తూ.. ఎలాంటి అభ్యంతరాలు రాలేదని, దీంతో చనిపోయిన ఉపాధ్యాయుడి పేరు లిస్టులో వచ్చిందన్నారు. బషీర్ స్థానంలో అర్హులకు పోస్టింగ్‌పై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

5 ఎకరాలకే రైతుభరోసా పరిమితి!

హైదరాబాద్, జూలై 5(నమస్తే తెలంగాణ) : రైతుభరోసా పెట్టుబడి సాయం 5 ఎకరాలకే పరిమితం చేయాలనే అంశంపై మంత్రుల సబ్ కమిటీలో ప్రధానంగా చర్చ జరిగినట్టు తెలిసింది. చిన్న, సన్నకారు రైతులకే పెట్టుబడి సాయం అందేలా విధానాలు ఉండాలని కమిటీ నిర్ణయించినట్టు సమాచారం. రైతుభరోసా విధివిధానాలపై మంత్రుల సబ్ కమిటీ శుక్రవారం సచివాలయంలో తొలిసారిగా సమావేశమై వివిధ అంశాలపై చర్చించినట్టుగా తెలిసింది. రాష్ట్రంలో 92 శాతం సన్న, చిన్నకారు రైతులే ఉన్నట్టు అధికారులు కమిటీకి నివేదించారు. దీంతోపాటు ఇటీవల రైతుల నుంచి తీసుకున్న అభిప్రాయాలను కమిటీ ముందుంచారు.

శాస్త్రీయంగా భూముల ధరల సవరణ

- ఉద్యోగుల బదిలీలు, స్టాంప్స్, రిజిస్ట్రేషన్స్ శాఖ ప్రక్షాళన
- సమీక్షలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 5 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని భూముల ధరలు గణనీయంగా పెరిగాయని, దానికి అనుగుణంగా భూముల ధరలను సవరించాలని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బహిరంగ మార్కెట్ విలువలకు, మార్కెట్ ధరలకు భారీగా వ్యత్యాసం ఉన్నదని, ఎలాంటి విమర్శలకు తావు లేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలని సూచించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖపై శుక్రవారం సచివాలయంలోని తన కార్యాలయంలో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాలని, అవసరమైన కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారు గంటల తరబడి చెట్ల కింద వేచి చూసే పరిస్థితి లేకుండా రాష్ట్రవ్యాప్తంగా అత్యాధునిక వసతులతో సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మిస్తామని వెల్లడించారు. రిజిస్ట్రేషన్లకు టైమ్ స్లాట్ అంశాన్ని పరిశీలించాలని సూచించారు. పనితీరు ఆధారంగా పారదర్శకంగా ఉద్యోగుల బదిలీలను చేపడుతామని హామీ ఇచ్చారు.